కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
శనివారం
14-03-2026
పేజీలు: 3

360° SINGLE TOPIC
విగ్రహాలు



# విగ్రహాలు.. వివాదాలు

## పటేల్ నుంచి గాంధీ విగ్రహం దాకా విమర్శలు

- రూ. వందల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు
- ప్రజాధనం వృథా, అవినీతి ఆరోపణలు
- నిర్వాసితులవుతున్న జనం

**దేశంలో ప్రతీ భారీ విగ్రహ నిర్మాణం వెనక వివాదం.. స్వాతంత్ర్య సమరయోధులు మొదలు రాజకీయ నేతల విగ్రహాల ఏర్పాటు వరకు ఆరోపణలే. నిర్వాసిత బాధితులూ కోకొల్లలు. ఒక పార్టీ దిగిపోగానే మరో పార్టీ అధికారంలోకి రావడం.. భారీ విగ్రహాలను ఏర్పాటు చేయడం.. అందుకు రూ. వందల కోట్ల ప్రజాధనం ఖర్చు చేయడం పరిపాటిగా మారింది.**

గుజరాత్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం కంటే ఎత్తులో ఎన్టీఆర్ విగ్రహం పెడతామని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలోనే ఎత్తయిన గాంధీ విగ్రహం పెడతామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఇలా ప్రభుత్వాలు పోటాపోటీగా తీసుకునే నిర్ణయాలు ప్రజల ఇండ్లను కూల్చేస్తున్నాయి.

గుజరాత్‌లో పటేల్ విగ్రహం ఏర్పాటు కారణంగా ఎంతోమంది ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. ఇప్పటికీ పరిహారం అందక కొందరు ఇబ్బందులు పడుతున్నారు. మేధాపాట్కర్ వంటి సామాజిక కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు.

**తెలంగాణలోనూ గాంధీ సరోవర్ పేరిట మహాత్మాగాంధీ భారీ విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రెడీ అయింది. ఇందుకోసం చేపట్టిన భూసేకరణపై వ్యతిరేకత మొదలైంది. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం సామాన్యుల ఇళ్లను కూల్చొద్దని ముఖ్యమంత్రికి గాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విగ్రహాల విషయంలోనూ అప్పట్లో విమర్శలు, ఆరోపణలు వెల్లువెత్తాయి. విగ్రహాలు, వివాదాలపై 'కలం' 360 డిగ్రీస్ స్పెషల్..**

- తెలంగాణ బ్యూరో, కలం

**గాంధీ విగ్రహం ఎత్తు:** 123 అడుగులు

**మొత్తం ఎత్తు (ఫౌండేషన్‌తో కలిపి):** 100 మీటర్లు


## గాంధీ సరోవర్

*మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నది. హైదరాబాద్ లంగర్‌హౌస్ సమీపంలో మూసీ నది ఒడ్డున బాపూఘాట్ వద్ద ప్రపంచంలోనే ఎత్తైన గాంధీ విగ్రహాన్ని నిర్మించాలని నిర్ణయించింది. ఈ ప్రాంతంలో గాంధీ ఐడియాలజీ సెంటర్, మ్యూజియం తదితర నిర్మాణాలు చేపట్టనుంది.*

**వివాదం:** ఈ ప్రాజెక్టు కోసం బండ్లగూడ జాగీర్, దర్గా పరిసర ప్రాంతాల్లో భూసేకరణ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసింది. ఈ ప్రాంతాల్లో బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించింది. బాధితులకు తగిన పరిహారం చెల్లిస్తామని పేర్కొంది. దీంతో వివాదం చెలరేగింది.

- భూసేకరణను బండ్లగూడ జాగీర్, ఉప్పరపల్లి, కిస్మత్‌పురా, దర్గా ప్రాంతాల్లోని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. బండ్లగూడ జాగీర్‌లోని 'మధు పార్క్ రిడ్జ్', ఇతర అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న దాదాపు 500 కుటుంబాల వాళ్లు ఆందోళనకు దిగారు. గాంధీ విగ్రహం కోసం తమ ఇళ్లను కూల్చడం అన్యాయమంటూ నిరసన తెలిపారు. తమకు వేరేచోట జాగా ఇస్తామన్నా, అపార్ట్‌మెంట్ కట్టిస్తామన్నా వద్దని అంటున్నారు. బాపూఘాట్‌లో ఇప్పటికే గాంధీ విగ్రహం ఉండగా, మరొకటి ఎందుకని ప్రశ్నిస్తున్నారు.
- తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని మహాత్మా గాంధీ మునిమనుమడు తుషార్ గాంధీ కూడా వ్యతిరేకించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం సామాన్యుల ఇళ్లను కూల్చవద్దని కోరారు. అలా చేయడం గాంధీ సిద్ధాంతాలకు విరుద్ధమని, 'గాంధీ పేరు మీద ఇలాంటివి చేయవద్దు' అని సీఎం రేవంత్ రెడ్డికి 'ఎక్స్'లో విజ్ఞప్తి చేశారు.

## అంబేద్కర్ స్మృతివనం



**రాష్ట్రం:** తెలంగాణ
**విగ్రహం:** అంబేద్కర్
**ఎత్తు:** 125 అడుగులు
**ఖర్చు:** రూ.147 కోట్లు

*హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ ఒడ్డున 'అంబేద్కర్ స్మృతివనం' పేరుతో అంబేద్కర్ భారీ విగ్రహం. 2016 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆనాటి బీఆర్ఎస్ సర్కార్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. 2023 ఏప్రిల్ 14న ప్రారంభించింది.*

**వివాదం:** విగ్రహ నిర్మాణం పూర్తి కావడానికి ఏడేండ్లు పట్టింది. ఇంత భారీ ఖర్చుతో అంబేద్కర్ విగ్రహం నిర్మించినా ఇప్పటికీ సందర్శకులకు పూర్తిస్థాయిలో ఎంట్రీ లేదు.

- తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారు. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి, దళితుల ఓటు బ్యాంకు కోసం అంబేద్కర్ విగ్రహాన్ని కేసీఆర్ నిర్మించారని అప్పట్లో ప్రతిపక్షాలు విమర్శించాయి.
- దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్న హామీని నెరవేర్చకుండా, అంబేద్కర్ విగ్రహంతో సరిపెట్టారని.. ఇది ఎలక్షన్ స్టంట్‌లో భాగమేనని దళిత సంఘాలు విమర్శించాయి.

## అమర జ్యోతి



**రాష్ట్రం:** తెలంగాణ
**విగ్రహం:** అమర జ్యోతి
**ఎత్తు:** ఏడు అంతస్తులు (రెండు సెల్లార్లతో కలిపి)
**ఖర్చు:** రూ.179 కోట్లు

*తెలంగాణ అమరవీరుల స్మారకార్థం హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ తీరాన అమరవీరుల జ్యోతి నిర్మాణమైంది. 2017లో అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేసి, 2023 జూన్ 22న ఆవిష్కరించారు.*

**వివాదం:** అమర జ్యోతి ప్రాజెక్టుకు దాదాపు రూ.60 కోట్లు ఖర్చవుతుందని మొదట అంచనా వేసినా ఆ తర్వాత మూడుసార్లు సవరించాల్సి వచ్చింది. ఖర్చు రూ.179.05 కోట్లకు చేరింది. ఈ నిర్మాణంలో అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

- ఏపీలోని ప్రొద్దుటూరుకు చెందిన కేపీసీ ప్రాజెక్ట్స్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారని, అది కేటీఆర్ ఫ్రెండ్ సంస్థ అని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు, భారీగా కమీషన్లు కొట్టేసేందుకు అంచనాలు పెంచినట్లు ఆరోపించాయి.

## స్టాచ్యూ ఆఫ్ సోషల్ జస్టిస్

*ఏపీ రాజధాని అమరావతిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని 2017లో అప్పటి టీడీపీ సర్కార్ నిర్ణయించింది. కానీ 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో విగ్రహ ఏర్పాటును విజయవాడకు మార్చింది. 206 అడుగులతో ప్రపంచంలోనే ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. 2021 డిసెంబర్ 21న పనులు మొదలవ్వగా, 2024 జనవరి 19న అప్పటి సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించారు.*

**వివాదం:** తెలంగాణలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు రూ.147 కోట్లు ఖర్చు చేయగా, ఏపీ ప్రభుత్వం రూ.404 కోట్లు ఖర్చు చేసింది. ఈ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

- దళితుల సంక్షేమానికి కేటాయించాల్సిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించారని ఆరోపణలు వచ్చాయి. విజయవాడ సిటీ ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక పెద్ద (గాంధీ గ్రౌండ్) మైదానంలో నిర్మాణాలు చేయడంతో క్రీడలకు, ఇతర బహిరంగ సభలకు చోటు లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశాయి.
- టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక.. అంబేద్కర్ విగ్రహం పీఠంపై ఉన్న బ్లాక్‌లలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరును గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. దీనిపై రాజకీయంగా దుమారం రేగింది.



**రాష్ట్రం:** ఆంధ్రప్రదేశ్
**విగ్రహం:** అంబేద్కర్
**ఎత్తు:** 206 అడుగులు
**ఖర్చు:** రూ.404 కోట్లు


## ఎన్టీఆర్ స్మృతివనం

**రాష్ట్రం:** ఏపీ, **విగ్రహం:** ఎన్టీఆర్
**ఎత్తు:** 597 అడుగులకు పైగా
**ఖర్చు:** రూ.1,750 కోట్లు



*ఏపీ రాజధాని అమరావతిలో ఎన్టీఆర్ స్మృతివనం ఏర్పాటు చేయాలని తొలి టర్మ్ (2014-19)లో టీడీపీ సర్కార్ నిర్ణయించింది. నీరుకొండ కొండపై భారీ ఎన్టీఆర్ విగ్రహం సహా పార్క్, నాలెడ్జ్ హబ్ నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేసింది. కానీ 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావడంతో ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. మళ్లీ 2024లో టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు పట్టాలెక్కింది. గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం-597 అడుగలు) కంటే ఎత్తులో నిర్మించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.*

**వివాదం:** రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల చెల్లింపులకే కష్టమవుతుండగా.. విగ్రహం కోసం ఇంత ఖర్చు చేయడమేంటని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఇన్ని వందల కోట్లు పెట్టి విగ్రహం పెట్టే బదులు.. ఆ నిధులను ప్రజా సంక్షేమానికి వినియోగించాలని కోరుతున్నాయి. ప్రజాధనంతో ఒక రాజకీయ నేత విగ్రహాన్ని భారీ స్థాయిలో ఏర్పాటు చేయడమేంటని నిలదీస్తున్నాయి.



## స్టాచ్యూ ఆఫ్ యూనిటీ

రాష్ట్రం: గుజరాత్, విగ్రహం: సర్దార్ వల్లభాయ్ పటేల్

ఎత్తు: 597 అడుగులు

ఖర్చు: రూ.2,989 కోట్లు

గుజరాత్‌లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ పేరుతో 597 అడుగుల సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటు. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం. 2014 అక్టోబర్ 31న పనులు ప్రారంభించగా, 2018 అక్టోబర్ 31న ప్రధాని మోదీ ఓపెన్ చేశారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో పాటు ఓఎన్‌జీసీ, ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ లాంటి పీఎస్‌యూల నుంచి విరాళాలు వచ్చాయి.

**వివాదం:**

- పటేల్ విగ్రహానికి చేసిన ఖర్చుపై దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ఈ ఖర్చుతో 2 ఐఐటీలు గానీ, 5 ఐఐఎం క్యాంపస్‌లు గానీ నిర్మించొచ్చని మేధావులు విమర్శించారు.
- ఈ ప్రాజెక్టు కింద నర్మదా జిల్లాలోని 72 గ్రామాల గిరిజనులు భూములు కోల్పోయారు. సుమారు 12 వేల ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. దీంతో 20కి పైగా గ్రామాల ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. దాదాపు 185 కుటుంబాలను వేరే చోటుకు తరలించాల్సి వచ్చింది.
- 32 గ్రామాల గిరిజనులకు ఇంకా పూర్తిస్థాయిలో పరిహారం అందలేదు. మిగిలిన వారికి సరైన పునరావాసం కల్పించలేదు.
- ఇక్కడ పర్యాటక అభివృద్ధి పేరుతో రోడ్ల విస్తరణ, హోటళ్ల నిర్మాణం వంటి వాటితో స్థానిక గిరిజనులు పొలాలు, షాపులు కోల్పోయారు. తద్వారా వాళ్ల జీవనోపాధి పోయింది.



## మెమోరియల్ స్కామ్

**ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ చీఫ్ మాయావతి హయాంలో (2007-12) లక్నో, నోయిడా ప్రాంతాల్లో మెమోరియల్ పార్క్‌లు నిర్మించారు. వీటిల్లో అంబేద్కర్, కాన్షీరామ్ లాంటి దళిత నేతల విగ్రహాలు ఏర్పాటు చేశారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో బీఎస్పీ ఎన్నికల గుర్తు అయిన ఏనుగు విగ్రహాలతో పాటు మాయావతి విగ్రహాలను కూడా నిర్మించారు.**

**వివాదం:** మెమోరియల్ పార్కులు, విగ్రహాల ఏర్పాటుకు మొత్తం దాదాపు రూ.4 వేల కోట్లు కేటాయించినట్టు రికార్డులు ఉండగా, అందులో రూ.1,400 కోట్ల దాకా అవినీతి జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇది 'మెమోరియల్ స్కామ్'గా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

**విచారణ:** 2012లో అధికారంలోకి వచ్చిన ఎస్పీ సర్కార్.. ఈ స్కామ్‌పై విచారణకు ఆదేశించింది. లోకాయుక్త జస్టిస్ ఎన్‌కే మెహ్రోత్రా విచారణ చేపట్టి.. రూ.1,400 కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైనట్టు తేల్చారు. మంత్రులు, అధికారులు, కాంట్రాక్టర్లు సహా 199 మందిని నిందితులుగా గుర్తించారు. ఈ నివేదిక ఆధారంగా విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ కేసు నమోదు చేసి ఎంక్వైరీ చేపట్టింది. ఈ క్రమంలో కొంతమందిని అరెస్టు చేసింది.

**మాయావతికి క్లీన్ చిట్:** విగ్రహాల ఏర్పాటుకు ప్రజాధనం దుర్వినియోగం చేశారని మాయావతిపై 2009లోనే సుప్రీంకోర్టులో పిల్ ఫైల్ అయింది. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు.. 2019లో కీలక కామెంట్లు చేసింది. ఆ డబ్బులను మాయావతి తిరిగి చెల్లించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. అయితే 2025 జనవరి 15న పిల్‌ను కొట్టేస్తూ మాయావతికి క్లీన్ చిట్ ఇచ్చింది. ఇది చాలా పాతది అని, విగ్రహాలను తొలగిస్తే మళ్లీ అదనంగా ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని, ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ గైడ్‌లైన్స్ ఉన్నాయని పేర్కొంటూ కేసును కొట్టివేసింది.